క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కలికిరి : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక శాఖ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు అగ్ని ప్రమాదాలో చోటు చేసుకుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అగ్నిని ఆర్పే పరికరాల వినియోగం తదితరాలపై వైద్యసిబ్బందితో పాటు స్థానికులకు ప్రయోగాత్మకంగా తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పవన్ కుమార్, అగ్నిమాపక అధికారి షేక్ మస్తాన్, సిబ్బంది నాగిరెడ్డి, వెంకటరమణ, చైతన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



25 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం

పీలేరు రూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీ కంచంవారిపల్లె వద్ద 25 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అభిషేకం, ప్రసాద వినియోగం, హోమం, మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో విగ్రహ దాత మేస్త్రీ నామాల చలపతి కుటుంబ సభ్యులు, భక్తులు నాగభూషణం రెడ్డి, భవనం వెంకటరమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గాయం భాస్కర్‌రెడ్డి, అర్చకులు పులిచెర్ల శ్రీనివాసు దీక్షితులు, పూజారి జి.వి. చలపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెలుగు సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిశోర్

మదనపల్లె సిటీ : వెలుగు సేవలు ప్రశంసనీయమని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిశోర్ అన్నారు. శుక్రవారం మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు సంస్థ 27వ వార్షికోత్సవం నిర్వహించారు. గత 26 సంవత్సరాలుగా వెలుగు సంస్థ విభిన్నప్రతిభావంతులు, వయో వృద్ధుల కోసం అనేక సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో అమృత హాస్పిటల్ డాక్టర్ గోపీకృష్ణ, అనిత్, ఆర్‌ఓ శ్రీకాంత్, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

'మత్తు'మాయలో పడొద్దు



మాట్లాడుతున్న ఆర్‌వి కృష్ణకిశోర్

కురబలకోట : బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు మత్తుకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నమయ్య జిల్లా దివ్యాంగుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్‌వి.కృష్ణ కిశోర్ కోరారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చాప కింద నీరులా మాదక ద్రవ్యాలు వ్యాపిస్తున్నాయన్నారు. శారీరకంగా, మానసికంగా, సామాజికంగా క్షీణింపజేస్తుందన్నారు. ఆలోచనా శక్తి, జీవిత లక్ష్యాలను దెబ్బతీస్తుందన్నారు. సహవాస దోషమో.. తల్లిదండ్రుల నిర్లక్ష్యమో..దుర్మార్గుల స్వార్థమో కారణమేదైతేనేం యువతలో మత్తు మేఘాలు కమ్మేస్తుండడం ఆందోళనకరమన్నారు. తెలిసో తెలియకో మాదక ద్రవ్యాల బారిన పడి ఆతర్వాత వాటికి బానిసలుగా మారిపోతున్నారన్నారు. యువత వీటికి దూరంగా ఉండాలన్నారు. వీటి నియంత్రణకు ప్రతి జిల్లాకు డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు.

భార్యాభర్తల గొడవలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : భార్యాభర్తల గొడవలో ముగ్గురు గాయపడిన సంఘటన మదనపల్లెలో జరిగింది. వడ్డీ పల్లె నెమలి నగర్ కు చెందిన విజయ్(26) కుటుంబ సమస్యల కారణంగా భార్య నందినితో గొడవ పడుతుండగా, అదే ప్రాంతానికి చెందిన మణి, రెడ్డి శేఖర్, విజయ్ పై దాడికి పాల్పడ్డారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన విజయ్ అన్న రెడ్డి శేఖర్ (37), బావమరిది చంద్రశేఖర్ (19)లపై సైతం దాడికి పాల్పడడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల సాయంతో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి వచ్చి చికిత్సలు తీసుకుని, ఘటనపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు విజయ్ ఫిర్యాదు చేశారు.

ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు

- పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలి
- హిందూ,ముస్లింల మధ్య విభేదాలు సృష్టించేందుకే పర్యాటకులపై దాడులు
- ఉగ్రవాద నిర్మూలనకు ప్రభుత్వ చర్యలకు సంపూర్ణ మద్దతు



మదనపల్లెలో ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నిసార్‌అహ్మద్, షమీంఅస్లాం తదితరులు

మదనపల్లె : జమ్ముకశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో అమాయకులైన పర్యాటకులపై అత్యంత పాశవికంగా కాల్పులు జరిపి భారతదేశాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నించిన పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం డిమాండ్ చేశారు. శుక్రవారం జామియా మసీదులో ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులతో కలిసి కాశ్మీర్ ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలో హిందూ,ముస్లింల మధ్య విభేదాలు సృష్టించేందుకు ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరపడం దుర్మార్గమైన పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఈ విషయంలో హిందువులకు తామంతా మద్దతుగా నిలుస్తామన్నారు. దేశంలోని హిందువులపై ఈగవాలినా ప్రాణాలు ఇచ్చేందుకు ముస్లింలు సిద్ధంగా ఉంటారన్నారు. దేశంలోని పౌరులందరూ ఒకటేనని, తమ మధ్య ఎలాంటి బేధభావాలు లేవన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నా దానికి తామంతా బేషరతుగా మద్దతు ఇస్తున్నామన్నారు. ఇదే విషయాన్ని ఆల్‌పార్టీ మీటింగ్‌లో వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీ మిథున్‌రెడ్డి స్పష్టం చేశారన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయిన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ, వారికి మనోధైర్యం ప్రసాదించాలని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రప్రభుత్వం పటిష్టచర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్రంకొండలో కొవ్వొత్తుల ర్యాలీ

గుర్రంకొండ : పహెల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ మండలకేంద్రమైన గుర్రంకొండ కొవ్వొత్తుల ర్యాలీ, మానవహారం నిర్వహించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండు వరకు సాగింది. అక్కడ కొవ్వొత్తులతో అందరూ మానవహారం ఏర్పాటు చేశారు. ఉగ్రవాదం నశించాలి.. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు రామాంజులు, ఆర్‌ఎస్‌ఎస్ కిషోర్, పరసాఅమరనాథ్, లెక్చరర్ ఎండీ జమీర్, ఎస్‌ఎల్‌టీ బాబ్‌జాన్, మీసేవారఫీ, నక్కాగోపాలకృష్ణ, సుంకర శ్రీనివాసులు, శోభనాల రమేష్‌బాబు, చింతిర్ల శ్రీనివాసులు, రమేష్‌బాబు, చలపతిలు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి, మానవహారం

బి.కొత్తకోట : కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడిచేసిన హతమార్చిన ఉగ్రదాడిని నిరసిస్తూ, మృతులకు నివాళులర్పిస్తూ గురువారం రాత్రి బి.కొత్తకోటలో టీడీపీ, బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక బీసీకాలనీ నుంచి మొదలైన ప్రదర్శన జ్యోతిచౌక్ చేరుకుని మానవహారంగా నిలబడి మృతుల ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ భారతమాతానికి జై అంటూ నినదించారు. ఉగ్ర భూతాన్ని తరిమికొట్టాలని డిమాండ్ చేశారు. అమాయక పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులకు కఠినశిక్షలు పడేలా న్యాయం చేయాలని కోరారు. అక్కడినుంచి మెయిన్‌రోడ్డు నుంచి దిగువబస్టాండ్ వరకు ప్రదర్శన కొనసాగించారు. కార్యక్రమంలో నాయకులు కుడుం శ్రీనివాసులు, కనకంటి ప్రసాద్, బంగారు వెంకటరమణ, రంజిత్, సురేంద్ర, రాజ, ప్రకాష్, బీజేపీ నాయకులు గోరంట్ల రమేష్, శీలం రంగా, ముకుంద, కే.రవీంద్ర, కార్తిక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గుర్రంకొండలో కొవ్వొత్తుల ర్యాలీ



బి.కొత్తకోటలో కొవ్వొత్తులతో ర్యాలీ

శారద ఇంగ్లిష్ మీడియం విద్యార్థుల ప్రతిభ



అజయ్‌కుమార్ నాయక్, సమీరా, జోషికరెడ్డి

ములకలచెరువు : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో శారాద ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థి మదనపల్లి డివిజ్ స్థాయిలోని అజయ్‌కుమార్ నాయక్ 592 మార్కులు సాధించాడు. రాళ్లపల్లె సమీరా 591 మార్కులు, జోషికరెడ్డి 586 మార్కులు సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ సనత్‌రెడ్డి, శ్రీవాణి, తోటి పాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

తప్పులులేని ఓటరు జాబితా తయారు చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరురూరల్ : తప్పులులేని ఓటరు జాబితా తయారు చేయాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. చనిపోయిన, ఊరు వదలి వెళ్లిపోయిన, డబుల్ ఎంట్రీలు ఉంటే ఫారం 8 ద్వారా చేర్పులు, తొలగింపులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీటీలు చంద్రశేఖర్, ప్రసాద్, ఎఎస్‌వో రామ్మోహన్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యసేవలు

పీలేరురూరల్ : స్థానిక ఎస్వీ డీలక్స్ రోడ్డులోని అశ్విని హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు వైద్యులు డాక్టర్ ప్రమంత్‌కుమార్‌రెడ్డి, అశ్వినిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఉచిత ఓపీ, కన్సల్టేషన్ ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9 మంది బైండోవర్

రామసముద్రం : కర్ణాటక మద్యం విక్రయించిన కేసుల్లో ఉన్న మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులను శుక్రవారం తహసీల్దార్ నిర్మలాదేవి ఎదుట బైండోవర్ చేశారు. మదనపల్లె ఎక్సైజ్ ఎస్‌ఐ జెబివుల్లా మద్యం కేసుల్లో ఉన్న భానుప్రకాష్, వెంకట్రమణ, పార్వతమ్మ, సునీల్, పవిత్ర, మంగమ్మ, బోయకొండ, రవి, మంజులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఇకపై ఎవరూ కర్ణాటక మద్యం అమ్మకుండా మంచిగా ఉండాలని, లేకుంటే జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి

మదనపల్లె సిటీ : వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు ప్రేమ్, సుల్తాన్ విద్యాశాఖ అధికారులను కోరారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను పరిశీలించామన్నారు. వేసవి సెలవుల్లో కూడా విద్యా తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం సెలవులు ప్రకటించినా ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. అనంతరం పాఠశాలల్లోని విద్యార్థులను తరగతి గదుల నుంచి ఇంటికి పంపివేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

సమన్వయకర్త నిసార్‌అహ్మద్



పదవులు పొందిన వైఎస్సార్ సీపీ నాయకులతో సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేసి, పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలో పదవులు పొందిన వైఎస్సార్ సీపీ నాయకులు, నిసార్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న తమను గుర్తించి పదవులకు సిఫారసు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అందరూ కలిసి ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు సంతాపం తెలుపుతూ రెండునిమిషాలు మౌనం పాటించారు. కార్యకర్తలను ఉద్దేశించి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న వారిని గుర్తించి పదవుల నియామకం జరిపామన్నారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి, ప్రజావసరాలు తీర్చడంలో సహకరించి మంచిపేరు సంపాదించుకోవాలన్నారు. కూటమిప్రభుత్వం పదినెలల పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, సంక్షేమం అందక ప్రభుత్వంపై తీవ్రవ్యతిరేకతతో ఉన్నారన్నారు. వారందరి వద్దకు వెళ్లి వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమాన్ని వివరించి, బాబు మోసాలను తెలపాలన్నారు. రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. భవిష్యత్తు గురించి భయపడాల్సిన పనిలేదని, మంచిరోజులు రానున్నాయని కార్యకర్తలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లె మహేష్‌బాబు, హబీబ్‌బాషా, తాజ్‌బాషా, మల్లికార్జునరెడ్డి, ఖాదర్‌బాషా, మస్తాన్‌సుహేల్‌బాషా, బీరంగిరేవతి, బస్రీ, మునిశేఖర్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి వృథాను అరికట్టాలి



కాప్పల్లి పంచాయతీలో పర్యటిస్తున్న ఈఓపీఆర్‌డీ

రామసముద్రం : మండలంలో తాగునీరు ఎక్కడా వృథా కాకుండా చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్‌డీ గఫూర్ సూచించారు. శుక్రవారం ఆయన రామసముద్రం మండలం కాప్పల్లె పంచాయతీ అజ్జంరెడ్డి పల్లి గ్రామంలో మంచినీటి కొళాయిల్లో వృథాగా పోతున్న తాగునీరు, పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. నీటిని వృథా చేయవద్దని ప్రజలకు సూచించారు. అలాగే పైపులైను లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అలాగే కాప్పల్లి దిన్నిమీద దిగువహరిజనవాడలో మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

సేఫ్ స్టెప్‌కు ఏపీఎస్‌సీహెచ్‌ఈ అవార్డు



అవార్డును చూపుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

కురబలకోట : అంగళ్లులోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విద్యార్థులు దృష్టిలోపం గల వారి కోసం రూపొందించిన సేఫ్ స్టెప్ ఆవిష్కరణకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఇ) రాష్ట్ర స్థాయి అవార్డు అందజేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రమణారెడ్డి తెలిపారు. కళాశాల విద్యార్థులు ఎం.గోపి, కె షబ్బీర్ అహమ్మద్, కె. రెడ్డి హిమజ, ఎం.అపర్ణ,కె. నవీన్‌కుమార్ రూపొందించిన ఆవిష్కరణకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ రామ్మోహన్ రావు ఈ అవార్డు అందజేసినట్లు తెలిపారు. దృష్టిలోపం గల వారికి ఎదురయ్యే రోజువారి సవాళ్లను అధిగమించడానికి సేఫ్ స్టెప్ సహాయపడుతుందన్నారు. ఈ పరికరంలో ఆధునిక సెన్సార్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, వైబ్రేషన్ అలెర్ట్‌లు, ఆడియో మార్గనిర్దేశక వ్యవస్థ వంటి ఫీచర్లు ఉండడం విశేషమన్నారు. వారి భద్రతతో పాటు సురక్షితంగా నడవడానికి దోహదపడే ఆవిష్కరణయని సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ వసంత సెల్వకుమార్ తెలిపారు

డబ్బులు తీసుకుని మోసం చేశారు..

న్యాయం చేయండి



బాధితుడు జోతా జయచంద్ర

పీలేరు రూరల్ : ఆశ్రమం కోసం అనువైన స్థలం ఇస్తామని నమ్మబలికి డబ్బులు మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పీలేరు పట్టణం కోటపల్లెకు చెందిన బాధితుడు జోతా జయచంద్ర కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాను హిందూ ధార్మిక ప్రచారం, భగవద్గీత ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. ఈ క్రమంలో ఒక ఆశ్రమం ఏర్పాటు చేయడానికి అనువైన స్థలం కావాలని తనకు పాత పరిచయం ఉన్న జి. మునేంద్రతో సంప్రదించినట్లు తెలిపారు. దీంతో స్థానిక జీవీనగర్‌కు చెందిన మల్లంగ్షాకు చెందిన స్థలం అని నమ్మబలికి పీలేరు గ్రామం సర్వే నెంబరు 1/4లో 1.20 ఎకరాల స్థలం చూపించి శాశ్విత స్వాధీన విక్రయ పత్రం రాసివ్వగా రూ. 25 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. అయితే ఆ స్థలంలోకి వెళ్లగా ఆ స్థలం వేరేవారిదిగా తెలిసిందని చెప్పారు. అదేవిధంగా గూడరేవుపల్లె గ్రామం సర్వే నెంబరు 2002/3లో 150 అంకణముల స్థలం పీలేరు పట్టణం పఠాన్ మౌలాకు చెందినదిగా చూపించి రూ. 17 లక్షలు తీసుకుని శాశ్విత స్వాధీనం విక్రయ పత్రం రాసిచ్చారని తెలిపారు. అయితే ఆ స్థలం కూడా వేరేవారిదని తేలిందన్నారు. తన సొంత జాగా అమ్మి, అప్పుచేసి, విరాళాలు సేకరించి మొత్తం రూ. 42 లక్షలు చెల్లించి మోసపోయానని తెలిపారు. తనకు మోసం చేసిన ముగ్గురిపై ఇప్పటికే జిల్లా కలెక్టరు, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జిల్లా అధికారులు స్థానిక తహసీల్దార్, సీఐకి న్యాయం చేయాలని చెప్పడం జరిగిందన్నారు. తనకు న్యాయం చేయడంలో ఆలస్యం జరుగుతోందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా గంధం ఊరేగింపు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం : పెద్దమండ్యంలోని కుషావతీ నది ఒడ్డున వెలసిన హజరత్ మహబూబ్ సుబహాని, హజరత్ మాసాబీబీ ఉరుసె షరీఫ్‌లో భాగంగా గురువారం రాత్రి గంధం ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గంధమహోత్సవంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, కలిచెర్ల మాజీ సింగిల్ విండో చైర్మన్ కడప సుధాహరరెడ్డి, పెద్దిరెడ్డి అభినయ్‌రెడ్డిలకు ఘన స్వాగతం పలికారు. బళ్లారి డ్రమ్స్ వాయిద్యాలు, బాణా సంచా వేడుకల మధ్య వీరు మాసాబావి వద్ద వరకు వెళ్లారు. మసాబావి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గంధం మహోత్సవంలో పాల్గొన్న కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుసేనీకి మాసాబీబీ దర్గా కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, పార్టీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి బైన మధూకరరెడ్డి, గ్రామ సర్పంచ్ సోదనపల్లె బాషా, ఎంపీటీసీలు మంచూరి జయరాం, బోడెం రవితేజ, మాసాబావి దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సెలవుల్లో ఊరెళుతున్నారా...తస్మాత్ జాగ్రత్త



ఎస్‌ఐ హరిహర ప్రసాద్

పెద్దతిప్పసముద్రం : ఒక వైపు పిల్లలకు పరీక్షలు ముగిసి వేసవి సెలవులు వచ్చేశాయి. మరో వైపు పెళ్ళిళ్లు, విహార యాత్రల కోసం సమాయత్తం అవుతున్నారా..అయితే మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ హరిహర ప్రసాద్ శుక్రవారం పలు సూచనలిచ్చారు. మీ ప్రయాణాలే వరం అన్నట్లుగా తాళం పడితే చాలు ఇళ్ళకు దొంగలు కన్నం వేసే పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. రాత్రి పూటే కాదు పగటి సమయంలో సైతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తచ్చాడినా, సంచరించినా ప్రజలు తక్షణం అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దొంగలు ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే వారి టార్గెట్ బీరువాలపైనే ఉంటుందంటున్నారు. డబ్బు, నగలు లాంటి విలువైన వస్తువులను బీరువాల్లో కాకుండా వేరే ప్రదేశంలో భద్ర పరచుకోవాలనాన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్ళతో పాటు ఆరుబయట నిద్రించే వారి ఇళ్ళనే దొంగలు టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారన్నారు. రాత్రి వేళ మండలంలో గస్తీ నిర్వహించే పోలీసు సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఎస్ఐ కోరారు.

పరిశుభ్రతతోనే మలేరియా నివారణ సాధ్యం



మదనపల్లెలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



ర్యాలీలో వైద్య ఆరోగ్య సిబ్బంది

మదనపల్లె : పరిశుభ్రతతోనే మలేరియా నివారణ సాధ్యమవుతుందని డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని త్యాగరాజ వీధిలోని యూపీహెచ్‌సీలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లా ఖాన్ సిబ్బంది తో కలసి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా జ్వరం ఆడ అనాఫీలస్ దోమకాటు ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీధర్, అనుపమ, జిలాని, డీఈఓ భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైడే పాటిస్తే వ్యాధులు దూరం

నిమ్మనపల్లె : వారానికి ఒకరోజు డ్రై డే పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ, మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు, డాక్టర్ ప్రత్యూష అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతే మలేరియాకు అసలైన నివారణ అని, ఇంటి చుట్టుపక్కల, గ్రామాలలో గుంతలను పూడ్చుకోవడం నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ ఇంద్రావతి హెల్త్ సూపర్వైజర్ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణ చర్యలు వేగవంతం

పీలేరు : మలేరియా నివారణ చర్యలు మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ జ్వరమైనా మలేరియా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకొని తగిన చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనియన్ అధికారి సాగర్, సీహెచ్‌వో జయలక్ష్మీ, హెచ్‌ఈ కొండయ్య, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు మోహన్, కుసుమ, పవన్ కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో మాజీ మంత్రి

మదనపల్లె : మదనపల్లె నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన పలు శుభకార్యాల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డితో కలిసి కొత్తపల్లె ఉపసర్పంచ్ నందకుమార్ కుమార్తె మానస వివాహ వేడుకలకు హాజరై ఆశీర్వదించారు. అనంతరం సీటీఎంలో ప్రకాష్ కుమార్తె రోజా నిశ్చితార్థ వేడుకలో పాల్గొని కాబోయే దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండపల్లి అక్కులప్ప, వెలుగుచంద్ర, ఆనందపార్థసారధి, రేవతి, యూనస్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వధువు మానసను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నిసార్‌అహ్మద్, దేశాయ్‌తిప్పారెడ్డి తదితరులు